క్లుప్తంగా

నేడు ఆలయ వార్షికోత్సవం

వీరపునాయునిపల్లె : మండలంలోని ఎస్.పాలగిరి క్రాస్ వద్ద వెలసిన సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 గంటలకు ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, 9గంటలకు పల్లకి సేవ, 10 గంటలకు సాయి వ్రతాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఎర్రగుంట్లలో రేపు..

ఎర్రగుంట్ల : పట్టణంలోని పద్మావతీపురం కోగటం రోడ్డున వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం 11వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరగనున్నాయని ఆలయ ధర్మకర్త రామాంజనేయులు ఆదివారం తెలిపారు. ఉదయం నుంచి సాయంత్ర వరకు వివిధ రకాల అభిషేకాలు పూజలు జరుగుతాయన్నారు. వేంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవం ఘనంగా జరుగుతుందన్నారు. భక్తులకు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. సాయంత్రం స్వామి గ్రామోత్సవం ఉంటుందన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పులివెందుల టౌన్ : స్థానిక ఉర్దూ కళాశాలలో విజయ కంటి వైద్య శిబిరం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని జిల్లా వైసీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లా తెలిపారు. ఉచిత కంటి సేవలను అందించే ప్రయత్నంలో భాగంగా జెండామాను వీధిలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 120 మంది స్త్రీలు ఉచిత పరీక్షల్లో పాల్గొన్నారన్నారు. అవసరమైన ఔషధాలను ఉచితంగానే అందించారన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీగౌతమ్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రొద్దుటూరు అభిలాష్ నేత్ర వైద్యశాల సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ సెంటర్ నేతృత్వంలో వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని మానవత మండల శాఖ చైర్మన్ డి.రఘురాంరెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ రామాంజనేయరెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో మానవత సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం

వేంపల్లె : స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ వెల్లడించారు. ఆదివారం ఆర్యవైశ్యసంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీవాసవి కల్యాణ మండపం, ఆర్యవైశ్య మహిళా మండలి సంఘాల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు రాయవరం సురేంద్ర, ఉపాధ్యక్షుడు దొంతు సుబ్బారావు, కార్యదర్శి సత్యనారాయణ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బారావు, ఉపాధ్యక్షులు నిరంజన్, వీరేంద్రనాథ్, వంశీ, కార్యదర్శి దొంతు సతీష్, వాసవి కల్యాణ మండపం అధ్యక్షుడు కామిశెట్టి సతీష్, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మ, ఉపాధ్యక్షులు నిచ్చెనమెట్ల మాధవి, కాంభోజి నిర్మల, కార్యదర్శి వడ్లకుంట మృదుల తదితర కార్యవర్గ సభ్యులు నూతన ప్రమాణ స్వీకారం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చింతకొమ్మదిన్నె : మండలంలోని నర్సింగ్ కళాశాలలో డ్రైవర్‌గా పనిచేస్తున్న నిత్యపూజలయ్య (24) గడ్డి మందు తాగి తిరుపతిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్ నాయక్ తెలిపారు. ఆయన కథనం మేరకు...

బోనసి నిత్య పూజలయ్య చింతకొమ్మదిన్నె మండలంలోని నర్సింగ్ కాలేజీలో డ్రైవర్‌గా పనిచేస్తూ మద్యం, పేకాటకు బానిసై రూ. 2 లక్షలు అప్పు చేసి, అవి తీర్చలేక మనస్థాపంతో మృతి చెందాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 5వ తేదిన రాత్రి 10.30 గంటలకు గడ్డి మందు తాగి మొదట కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కొరకు చేరి తర్వాత తిరుపతి రమాదేవి హాస్పిటల్‌లో చేరి చికిత్స పొందుతూ శనివారం రాత్రి 10 గంటలకు చనిపోయాడు. ఈ విషయమై చింతకొమ్మదిన్నె పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ మృతి

కడప అర్బన్: కడప రిమ్స్ పీఎస్ పరిధిలోని సాగర్ కాలనీలో నివాసముంటున్న షేక్ యాస్మిన్(32) ఈ నెల 5వ తేదీన కుటుంబ సమస్యలతో విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. భర్త ఖాదర్‌బాషా గమనించి రిమ్స్‌లో చేర్పించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కళింగరతో ప్రయోజనాలు ఎన్నో



విక్రయానికి సిద్ధంగా ఉన్న కళింగర కాయలు



పులివెందుల రూరల్ : కళింగర కాయ తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఇది శరీరంలో వేడిమి నుంచి ఉపశమనంతోపాటు చలువ చేస్తుంది. ఎండాకాలంలో ఎంతో మేలు అని వైద్య నిపుణులు చెబుతున్నారు. వేసవి సమయంలో మన శరీరంలో వాటర్ లెవెల్స్ నీటిస్థాయి తగ్గిపోతుంటాయి. డీహైడ్రోజన్ స్టేజ్‌కి వెళ్లిపోతుంటాయి. అలాంటప్పుడు వడదెబ్బ బారిన పడకుండా కాపాడుతుంది. మన శరీరంలో వాటర్ లెవెల్స్, షుగర్ లెవెల్స్ తగ్గిపోకుండా కాపాడుతుందని వైద్యులు చెబుతున్నారు. కళింగర కాయలో ఉండే విటమిన్లు, పోషకాలు వ్యాధి నిరోధక శక్తిని పెంచి యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్, కాల్షియం, సోడియం, మెగ్నీషియం, పోటాషియం, క్లోరిన్, విటమిన్ బి, విటమిన్ సి, సుక్రోజ్, గ్లూకోజ్ ఎండాకాలంలో మన శరీరానికి కావాల్సిన పోషకాలు అందిస్తాయని వైద్య నిపుణులు అంటున్నారు. కళింగర కాయలు తినడంవల్ల వ్యాధి నిరోధక శక్తి పెరగడంతోపాటు మల బద్ధకం రాకుండా చేస్తుంది. అలాగే వృద్ధాప్యంలో అంధత్వం నివారిస్తుంది. రక్తప్రసరణ సక్రమంగా అవుతుంది. అలసట రాకుండా చేస్తుంది.

ప్రజలు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు



వేసవి కాలంలో కళింగర కాయల విక్రయాలు జోరుగా సాగుతాయి. కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. చిన్న పిల్లలనుంచి వృద్ధుల వరకు వీటిని ఎంతో ఇష్టంగా తింటారు. కళింగర కాయలకు మార్కెట్లో కిలో రూ.20ల నుంచి రూ.25ల వరకు విక్రయిస్తున్నారు. తోపుడుబండ్లపైన అయితే కాయల ముక్కలు ప్లేటు రూ.10లకు అమ్ముతున్నారు.

– శ్రీనివాసులు(స్థానికుడు), పులివెందుల

వ్యాపారాలు బాగున్నాయి



ప్రస్తుతం ఎండాకాలం కావడంతో కళింగర కాయలకు డిమాండ్ ఉంది. వ్యాపారాలు కూడా బాగానే సాగుతున్నాయి. అనంతపురం జిల్లా, సత్యసాయి జిల్లా తదితర ప్రాంతాలకు వెళ్లి అక్కడ టన్ను కళింగర కాయలన రూ.10వేలతో కొనుగోలు చేసి ఇక్కడ విక్రయాలు చేస్తున్నాం. ఎండాకాలంతో పాటు రంజాన్ మాసం కావడంతో కొనుగోలు చేస్తూ తీసుకెళ్తున్నారు.

– టోపివల్లి, వ్యాపారస్తుడు, పులివెందుల

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అలనాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

సింహాద్రిపురం : మండలంలోని కోవరంగుంటపల్లె జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1974–75 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తుమ్మలపల్లె సూర్యుడు, మధు సూదనా శాస్త్రిల ఆధ్వర్యంలో అప్పటి విద్యార్థులు పూర్వపు విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు అలనాటి విషయాలను గుర్తు చేసుకున్నారు. అలాగే తుమ్మలపల్లి సూర్యుడు గురువులను సన్మానించారు. 50 సంవత్సరాల తర్వాత ఇలా కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, జీవితంలో ఈ జ్ఞాపకం తీపి జ్ఞాపకంగా గుర్తుండి పోతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల స్థలదాత వారసులు దేవిరెడ్డి సునీల్ కుమార్‌రెడ్డి, పాఠశాల హెడ్మాస్టర్ రమణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని 33/11 కె.వి. కోతి సమాధి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కె.వి. పార్నపల్లె రోడ్డు ఫీడర్, 11 కె.వి. రాజీవ్ నగర్ ఫీడర్ల ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు.

గొప్ప పౌరులుగా ఎదగాలి



మాట్లాడుతున్న ఎంఈఓ జాఫర్ సాదిక్

వేంపల్లె : పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించి భవిష్యత్‌లో సమాజానికి ఉపయోగపడే గొప్ప పౌరులుగా ఎదగాలని ఎంఈఓ సీఎస్ జాఫర్ సాదిక్ తెలిపారు. ఆదివారం స్థానిక ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థి జీవితానికి మార్కులు ఒక్కటే ప్రామాణికం కాదని, చదువుతోపాటు జీవితానికి అవసరమైన జ్ఞాన సమపార్జన చేయాలని, తద్వారా సమాజ శ్రేయస్సుకు పాటుపడాలన్నారు. అనంతరం పాఠశాల వ్యవస్థాపకులు గుజ్జుల కృష్ణారెడ్డి పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాసేటప్పుడు పాటించాల్సిన మెళకువలను తెలియజేశారు. పాఠశాల కరస్పాండెంట్ బీఎస్ రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

సమాజ సేవలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

వేంపల్లె : సమాజ సేవలో విద్యార్థులందరూ భాగస్వామ్యం కావాలని ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారిణి ఇందుమతి తెలిపారు. ఆదివారం మండలంలోని నందిపల్లెలో ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ -12 విద్యార్థులు సామాజిక అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ అక్షరాస్యత, పర్యావరణ పరిరక్షణ, నకిలీ ఫోన్ కాల్స్ తదితర సామాజిక సమస్యలపై అవగాహన పెంచడంలో దృష్టి సాధించినట్టు తెలిపారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ఇంటింటికి వెళ్లి అవగాహన ప్రచారాలు, గ్రామస్తులతో పరస్పర చర్చలు నిర్వహించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధిలో సమాచార సంఘాల పాత్రను నొక్కి చెప్పారు. సామాజిక బాధ్యత పట్ల నిబద్ధత గ్రామీణాభివృద్ధికి అర్థవంతంగా సహకరించేలా విద్యార్థులను ఎంతో ప్రోత్సహిస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యా వలంటీర్లు పాల్గొన్నారు.

గంగమ్మా.. చల్లంగా చూడమ్మా



లింగాలలో తేరుపై ఊరేగుతున్న అమ్మవారు



సీకేదిన్నెలో విశేష అలంకారంలో గంగమ్మతల్లి

వేంపల్లె : స్థానిక పెద్ద దేవరగడ్డ వీధిలో వెలసిన గంగమ్మకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలందరూ గంగమ్మకు జలాభిషేకం చేసి చలువ ముద్దను ఏర్పాటు చేసి బోనాలను నైవేద్యంగా పెట్టి తమ మొక్కును తీర్చుకున్నారు. ప్రతి ఏడాది ఉగాది దగ్గర పడుతున్న సమయంలో గంగమ్మకు చలువ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గంగమ్మా.. చల్లంగా చూడమ్మా అంటూ చుట్టూ ప్రదర్శనలు చేసి వేడుకున్నారు. ఈ సందర్భంగా జంతు బలులను చేశారు. కార్యక్రమంలో గౌరీదేవి ఆలయ సంఘం ప్రెసిడెంట్ నంబూరు కులాయప్ప, మహిళలు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : మండలంలోని పెద్దకుడాల, చిన్నకుడాల గ్రామాల్లో వెలసిన శ్రీగంగమ్మ దేవత తిరునాల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు, పూజలు నిర్వహించి తిరునాలకు శ్రీకారం చుట్టారు. పెద్దకుడాల గ్రామంలోని గంగమ్మ దేవతను రంగు, రంగుల గాజులతో ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు. భక్తులు వందలాది మంది తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో ఎస్ఐ మధుసూదనరావు, పోలీసు సిబ్బంది బందోబస్తును ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహానికి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని మొయిళ్లచెరువు, పాయసంపల్లె, ఈర్లపల్లె, కొమ్మద్ది, అంకిరెడ్డిపల్లె, తలపనూరు తదిర గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ముద్దల పండుగ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ వేడుకల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. బైరవ ట్రాన్స్‌పోర్ట్ అధినేత మహేంద్రారెడ్డి, మాజీ మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, అడవిచెర్లోపల్లె మాజీ సర్పంచు సాంబశివారెడ్డి, బీసీ నాయకుడు ప్రతాప్ యాదవ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు. గంగమ్మతల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చింతకొమ్మదిన్నె :

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి జాతర తర్వాత మొదటి ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, గంధం, పసుపు పూలదండలతో విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు చేసి తమ మొక్కుబడులను, ముడుపులను అమ్మవారికి చెల్లించుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే ఆలయ సమీపంలోని వీరభద్రస్వామి శివాలయం ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులు పూజలు చేశారు.

తొండూరులో..

తొండూరు : మండలంలోని పలు గ్రామాల్లో ముద్దల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం గంగనపల్లె, ఊడవగండ్ల తదితర గ్రామాల్లో ముద్దల పండుగ వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. అనంతరం బంధువులకు, స్నేహితులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

ఫ్లైయాష్ టిప్పర్లను అడ్డుకుని నిరసన



టిప్పర్లను అడ్డుకున్న స్థానికులు

ఎర్రగుంట్ల : మండలంలోని డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు నుంచి వెలుబడుతున్న ఫ్లైయాష్‌ను టిప్పర్లలో అధికలోడుతో తరలిస్తున్నప్పుడు రోడ్డుపై పడుతోందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం స్థానికులు రోడ్డుకు అడ్డంగా నిలబడి టిప్పర్లను అడ్డుకుని నిరసన తెలిపారు. పెద్ద ఎత్తుగా బూడిద వేసుకుని తరలిస్తున్నారని దుమ్ము వల్ల కళ్లలో పడి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి బూడిద రవాణను పూర్తిగా తగ్గించాలని వారు కోరారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని చర్యలు తీసుకుంటామని స్థానికులకు చెప్పినట్లు తెలిపారు.

ఇరువురు మధ్య ఘర్షణ

వేంపల్లె : స్థానిక కడప రోడ్డులో ఇరువురు మధ్య ఘర్షణ పడటంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. వీరపునాయునిపల్లె మండలం తంగేడుపల్లె గ్రామానికి చెందిన గణేష్‌కుమార్ రెడ్డి, శివకృష్ణారెడ్డిలు మినరల్ వాటర్ కోసం వేంపల్లెకు వచ్చారు. ఈ నేపథ్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద క్రిస్టియన్ కాలనీకి చెందిన తేజ అనే వ్యక్తి అసభ్యకరమైన పదజాలాలతో మాట్లాడారని గణేష్‌కుమార్‌రెడ్డి, శివకృష్ణారెడ్డిలతో గొడవపడ్డాడు. ఆ తర్వాత విషయం తెలుసుకున్న గణేష్‌కుమార్‌రెడ్డి బంధువు అరుణ చైతన్యరెడ్డి వాటర్ ప్లాంట్ వద్దకు వచ్చి ఎందుకు గొడవ పడ్డారని అడగగా తేజ అనే వ్యక్తి కొంతమందిని తీసుకువచ్చి అతనిని తీవ్రంగా గాయపరిచారు. ఈ క్రమంలో ఒకరిని ఒకరు తోపులాడుకోవడంతో గణేష్‌కుమార్‌రెడ్డి, తేజలకు గాయాలయ్యాయి. స్థానికులు గాయపడ్డ వారిని వేంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు జరిగిన సంఘటనపై విచారణ చేపడుతున్నారు.

ఆర్థిక బకాయిలపై భరోసా ఏదీ?

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వవలసిన ఆర్థిక బకాయిలపై స్పష్టత ఇవ్వాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ గురుకుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడా రు. 18 నెలలుగా జడ్పీఎఫ్ లోన్లు, ఫైనల్ పేమెంట్లు, ఏపీజీఎల్ఐలోన్లు, ఫైనల్ పేమెంట్లు అర్జిత సె లవు బకాయిలు సకాలంలో ఇచ్చేట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పదవీ విర మణ పొందిన ఉపాధ్యాయులు సంవత్సర కాలంగా రావలసిన బకాయిలు త్వరగా అందజేయాలని కోరారు. అలాగే 2022 సంవత్సరంలో పీఆర్సీ సమయంలో ఉపాధ్యాయుల, ఉద్యోగుల జీతాల బిల్లులు చేయకున్నా రాష్ట్ర ప్రభుత్వం నేరుగా వారి జీతాలు వారి అకౌంట్లో జమ చేసిందని కానీ జడ్పీ పీఎఫ్ మొత్తం ఇంత వరకు ఉపాధ్యాయుల అకౌంట్లో జమకాలేదన్నారు. కార్యక్రమంలో రీజనల్ కన్వీనర్ ప్రతాపరెడ్డి, కమిటీ కన్వీనర్ మహమ్మద్‌గౌస్, ప్రధానోపాధ్యాయుడు రామలింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోరా..!

వేంపల్లె : జిల్లాలోనే మేజర్ పంచాయతీ వేంపల్లె గ్రామ పంచాయతీలో గత 20 నెలలుగా ఎలాంటి విధులు నిర్వహించకుండా ప్రభుత్వంతో జీతం తీసుకుంటున్న జూనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోరా అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అధికారులను ప్రశ్నించారు. ఆదివారం వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇక్కడ పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ 2019–2022 మధ్యకాలంలో లెక్కకు మించి అవినీతికి పాల్పడటంతో అతనిని పోరుమామిళ్లకు డిప్యూటేషన్ మీద బదిలీ చేయగా అక్కడ కూడా అవినీతి చేసి ఉన్నత స్థాయి అధికారులను ప్రసన్నం చేసుకుని తిరిగి వేంపల్లెకు వచ్చారన్నారు. తనకున్న పలుకుబడితో ఏ రోజు విధులు నిర్వహించిన పాపాన పోలేదన్నారు. ఏమయ్యా ప్రజలు కట్టే పన్నులతో జీతం తీసుకుంటా ఎందుకు ఏ పని చేయరని అడిగితే నాకు నచ్చిన పని ఇస్తేనే చేస్తానంటూ ఇన్నాళ్లు ఖాళీగా ఉంటూ జీతం తీసుకుంటున్నాడన్నారు. ఇటీవల గ్రామ పంచాయతీలో అవినీతిపై విచారణ జరిపిన అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవడం సంతోషకరమే కానీ.. మునుపు అంతకు మించి అవినీతికి పాల్పడిన వారు ఇక్కడ కొనసాగడానికి అర్హులు కారని చెప్పారు. ఇకనైనా 2019–2022 సంవత్సరాల మధ్య కాలంలో వారు చేసిన అవినీతికి సంబంధించిన ఆధారాలు నా దగ్గర ఉన్నాయన్నారు. విచ్చలవిడిగా అవినీతికి పాల్పడి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తాగునీటి కష్టాలు



నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్

ఎర్రగుంట్ల : మండలంలోని మాలెపాడు గ్రామంలో వాటర్‌ప్లాంట్ మరమ్మతుకు నోచుకోకపోవడంతో తాగునీటి కష్టాలు తీవ్రంగా మారాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ గ్రామానికి గతంలో ఆర్టీపీపీ నిధులతో వాటర్ ప్లాంట్‌ను నిర్మించారు. తర్వాత ఈ వాటర్ ప్లాంట్‌ను స్థానిక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నడుస్తూ వచ్చిందన్నారు. అయితే ప్రస్తుతం వాటర్ ప్లాంట్ మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారింది. తాగునీటి కోసం గ్రామస్తులు కలమల్ల, పోట్లదుర్తి, వెంకటాపురం గ్రామాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైన వాటర్‌ప్లాంట్‌ను మరమ్మతులు చేయించి తాగునీటిని అందించాలని స్థానికులు కోరుతున్నారు.

పెండ్లికి పిలవడానికి వచ్చి చోరీ



బాధితురాలు మహబూబీ

ఎర్రగుంట్ల : పెండ్లికి పిలవడానికి ఓ వ్యక్తి వృద్ధురాలి ఇంటికి వెళ్లి మాటలు కలిపి ఆమె చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని తీసుకుని వెళ్లిపోయాడు. పట్టణంలోని 12వ వార్డులోని మహబూబీ అనే వృద్ధురాలి ఇంటికి గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. మా ఇంటిలో పెండ్లి జరుగుతుంది.. నీవు తప్పకుండా రావాలని మాటలు కలిపాడు. అలాగే అవ్వా నీ చేతికి ఉన్న ఉంగరం బాగా ఉంది.. నేను కూడా ఇదే అకారంలో ఉంగరంను పెండ్లి కూతురికి చేయించాలి.. ఒక్కసారి తీసి ఇవ్వు అని చెప్పాడు. దీంతో ఆ వృద్ధురాలు నమ్మి చేతికి ఉన్న ఉంగరంను ఆ వ్యక్తికి ఇచ్చింది. మీ కోడలు ఇంటికి వెళ్లి పెండ్లికి పిలిచి వస్తాను అని చెప్పి అక్కడ నుంచి జారుకున్నాడు. సుమారు రూ.20 వేలు విలువ ఉంటుందని చెప్పింది. వచ్చింది దొంగ అని తెలుసుకుని వెంటనే పోలీసులకు తెలిపింది. పట్టణ సీఐ నరేష్‌బాబు విరవణ కోరగా ఈ విషయంపై విచారణ చేస్తున్నామన్నారు.

అక్రమ అరెస్టులు ఉద్యమాలను ఆపలేవు



ధర్నాకు వెళ్లకుండా అరెస్ట్ చేసిన పోలీసులు

కొండాపురం : విజయవాడలో నేడు జరిగే ధర్నాలో పాల్గొనుటకు వెళుతున్న అంగన్‌వాడీ వర్కర్స్, ఆయాలను ఆదివారం రాత్రి కొండాపురం రైల్వేస్టేషన్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. కూటమి ప్రభుత్వం ఉద్యమాలను అపలేదని సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు మండిపడ్డారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీ వర్కర్స్, అయాల సమస్యలను పరిష్కరిస్తామని వాటితో పాటు జీతాలు పెంచుతామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. న్యాయ బద్ధంగా ధర్నా చేస్తుంటే ధార్నాలకు వెళ్లకుండా పోలీసులతో అరెస్ట్ చేయించడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎఐటీయూసీ మండల ప్రదాన కార్యదర్శి పి.వెంకటరమణ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు తారాదేవి, దేరాజ్యోతిలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : రైల్వేస్టేషన్ వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదివారం రాత్రి ధర్నాకు దిగారు. సోమవారం విజయవాడలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూల ఆధ్వర్యంలో మహాధర్నాకు పిలుపునించారు. బయలు దేరడానికి రైల్వేస్టేషన్‌కు వెళ్లగా అక్కడ పోలీసులు వారిని అడ్డుకున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



శాస్త్రీయ నృత్యంలో చిన్నారులు



తైక్వాండో విన్యాసాలలో చిన్నారులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని వైఎస్సార్ ఉలిమెల్ల లేక్‌లో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డ్యాన్స్ మాస్టర్ శబరీస్ ఆధ్వర్యంలో వేంపల్లె సంసిద్ సతీష్‌రెడ్డి స్కూలు చిన్నారుల జానపద, శాస్త్రీయ, సినిమా పాటలకు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. అలాగే చిన్నారుల తైక్వాండో విన్యాసాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రమీలదేవి, శిల్పారామ ఏఓ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడు హల్‌చల్



మద్యం మత్తులో రోడ్డుపై బైటాయించిన యువకుడు

జమ్మలమడుగు రూరల్ : మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడు జమ్మలమడుగు పట్టణంలోని తాడిపత్రి రహదారిలో ఉన్న సంజామల మోటు వద్ద హల్ చల్ చేశాడు. ఆదివారం మధ్యాహ్నం మద్యం మత్తులో షర్ట్‌ను తీసివేసి ప్రధాన రోడ్డుపై వస్తున్న బస్సులను, లారీలను, కార్లను బైక్‌లను అడ్డుకుని డబ్బుల కోసం వాహనదారులను వేధించాడు. రోడ్డుకు అడ్డంగా కూర్చొని రాక పోకలకు తీవ్ర అంతరాయం కలిగించాడు. ప్రజలు ఎంత చెప్పిన వినకుండా రోడ్డుపై బైటయించాడు.

కట్టడాల కూల్చివేత దారుణం

కడప కార్పొరేషన్: కాశిరెడ్డి నాయన పేరిట వెలసిన జ్యోతి క్షేత్రంలో కట్టడాలను అటవీ అధికారులు కూల్చివేయడం అన్యాయమని సాయి యువజన సేవా సంఘం అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెడుతూ, నీడ లేనివారికి ఆశ్రయం కల్పిస్తున్న కాశిరెడ్డి నాయన క్షేత్రంలోని కట్టడాలను కూల్చివేయడం సరికాదన్నారు. కాశిరెడ్డి నాయన క్షేత్రంలో భక్తులు హుండీలో డబ్బులు వేయరని, వారి శక్తి మేరకు ధాన్యం, కూరగాయాలు వితరణ చేస్తారన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలన్నారు.

సాహిత్య అకాడమీ సదస్సుకు ఆహ్వానం



వేంపల్లె షరీఫ్

వేంపల్లె : దేశ వ్యాప్తంగా ఉన్న రచయితలు, కవులు, ఇతర రంగాల మేధావులతో ఢిల్లీలో కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆరురోజుల సాహిత్య పండుగకు జిల్లాకు చెందిన వేంపల్లె షరీఫ్‌కు ఆహ్వానం అందింది. 'ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్' పేరుతో ఈ నెల 7న మొదలైన సాహిత్య సదస్సు 12వ తేదీతో ముగుస్తుంది. ఈ ఏడాది కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు పొందిన దేశంలోని వివిధ భాషల రచయితలకు అవార్డు ప్రదానోత్సవంతోపాటు వివిధ భాషల నుంచి పలువురు రచయితలు, కవులు ఇతర సాంస్కృతిక రంగాల మేధావులను పిలిచి పలు సాహిత్య సదస్సులు ఏర్పాటు చేశారు. రవీంద్రనగర్‌లో 10వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే బహుభాషా కథా పఠనంలో వేంపల్లె షరీఫ్ తన కథను వినిపిస్తారు. ఈ సదస్సుకు ప్రముఖ రచయిత ఖలీద్ హుస్సేన్ అధ్యక్షత వహిస్తారు. ఇదే వేదికపై ఇంకా హిందీ, రాజస్థానీ, అస్సామి, బోడో భాషలకు చెందిన రచయితలు తమ కథలను ఆంగ్లంలో కానీ హిందీలో కానీ చదివి వినిపిస్తారు. తెలుగు నుంచి ఓల్గా, ప్రసేన్ ముకుంద రామారావు, కొలకలూరి ఇనాక్, గోరేటి వెంకన్న, ఖాదర్ మొయినుద్దీన్ వంటి ప్రముఖ రచయితలు ఈ సదస్సులో పాల్గొంటున్నారు.